

కుమురంభీం చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ దివాకర, పీవో చిత్రా మిశ్రా



వై జంక్షన్‌వద్ద ఆదివాసీల నృత్యాలు



ఏటూరునాగారంలో ఆదివాసుల ర్యాలీ

ఆదివాసీల అభివృద్ధికి పక్కా ప్రణాళిక

- చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తాం
- గిరిజనులు సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి
- ములుగు కలెక్టర్ దివాకర
- ఐటీడీఏ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 9: ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. ఆదివాసీల హక్కులు, చట్టాలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఐటీడీఏ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగాయి. ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా డోలు వాయిద్యాలు, నృత్యాల నడుమ భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం వద్ద కలెక్టర్ దివాకరతోపాటు, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీల జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో గిరిజ న భవన్‌చేపట్టిన ఉత్సవాలను కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీలంటేనే మానవత్వమని, నమ్మిన వారి పట్ల పూర్తి విధేయ తతో ఉంటారని అన్నారు. ఆదివాసీలు తమ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను గిరిజనులకు చేరేలా ఐటీడీఏ విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు. గిరిజన యువతలో నైపుణ్యాలను పెంపొందించడం కోసం శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో గిరిజనుల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలను చేపడుతామని తెలిపారు.

ఆదివాసీల అభ్యున్నతే ధ్యేయం : ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఆదివాసీల అభ్యున్నతే ధ్యేయంగా ఐటీడీఏ కృషి చేస్తోందని పీవో చిత్రామిశ్రా అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ను సకాలంలో గిరిజనులకు అందే లా ఐటీడీఏ కృషి చేస్తోందన్నారు. చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తూ గిరిజనుల హక్కులను కాపాడుతామన్నారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లోని ప్రజలకు పోలీసులు అండగా ఉంటారన్నారు. సమస్యలుంటే నేరుగా తమను సంప్రదించాలని సూచించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అన్నారు. వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు ఆహూతులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు పోడెం బాబు, చింత కృష్ణ, పులిసె బాలకృష్ణ, మైపతి సంతోష్, గొప్ప వీరయ్య, పోడెం రత్నం, డీడీ పోచం, ఈఈ వీరభద్రం, ఎస్‌వో రాజ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీల వేషధారణలో కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా



మల్లంపల్లిలో జరిగిన గ్రామసభలో జేడీ మల్లంపల్లి మండలం పేరుకు సమ్మతం తెలు'చేయి ఎత్తిన గ్రామస్థులు

మల్లంపల్లికి జగదీశ్ పేరు

- మంత్రి సీతక్క సూచనతో గ్రామసభల నిర్వహణ
- ఏకవాక్యంగా మద్దతు తెలిపిన ప్రజలు

ములుగు, ఆగస్టు 9: మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేయక ముందే కొత్త పేరు పెట్టాలనే ప్రతిపాదన ముందుకొచ్చింది. ఇదే గ్రామానికి చెందిన దివంగత తెలంగాణ ఉద్యమకారుడు, ములుగు మొదటి జిల్లాపరిషత్ ఛైర్మన్ కుసుమ జగదీశ్ పేరు కలిసేలా జేడీ మల్లంపల్లిగా నామకరణం చేయాలనే ప్రజల ఆకాంక్ష నెరవేరబోతోంది. ఇందులో భాగంగా శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సూచనతో కలెక్టర్ టి.ఎస్. దివాకర గతనెల 25న సర్క్యులర్ జారీ చేశారు. దీనికి అనుగుణంగా మల్లంపల్లి, రామచంద్రాపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో సభలు నిర్వహించారు. మల్లంపల్లిలో జరిగిన సభకు ఎంపీడీవో రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మల్లంపల్లి మండలానికి జగదీశ్ పేరును పెట్టే ప్రతిపాదనపై గ్రామస్థులంతా హర్షం వ్యక్తంచేస్తూ మద్దతు తెలిపారు. ఈ గ్రామసభలలో పంచాయతీ కార్యదర్శి పోలు రాజు, మాజీ ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

గతేడాది సెప్టెంబరు 23న రాష్ట్ర ప్రభుత్వం మండల ఏర్పాటు కోసం 331/2023ద్వారా గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. కానీ కార్యరూపం దాల్చలేదు. ములుగు ఎమ్మెల్యే సీతక్క కీలక మంత్రి పదవిలో ఉండటం, మండల ఏర్పాటు ఉద్యమానికి మద్దతుగా నిలిచి జగదీశ్ పేరును పెట్టాలని స్వయంగా ప్రతిపాదించడమే కాకుండా అధికార యంత్రాంగాన్ని కార్యాచరణకు ఆదేశించడంతో మండల ఏర్పాటుపై ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నూతన మండలాల డిమాండ్లు వినిపించడంలేదు. పెద్దగా ఒత్తిడి లేకపోవడంతో గత ప్రభుత్వ హయాంలో జారీ అయిన మల్లంపల్లి గెజిట్‌ను త్వరలోనే ఆచరణలో పెడుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణపై భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ
- తక్కువ భూములు సేకరించేలా చర్యలు : ఎమ్మెల్యే గండ్ర





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 9: గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై రైతులు ఆందోళన చెందొద్దని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణపై టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల రైతులతో కలెక్టర్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే విషయంలో రైతుల పట్ల ప్రభుత్వం సాకులూలంగా

మిగతా 8వ పేజీలో...

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



శాంతమ్మ (ఫైల్)

మహదేవపూర్, ఆగస్టు 9 : ఆగి ఉన్న లారీని టవేరా వాహనం ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. ఆమె కుమారుడు, కోడలికి తీవ్ర గాయాలయ్యాయి. భూపాలపల్లి జిల్లాలో మహదేవపూర్-కాటారం జాతీయ రహదారి అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహదేవపూర్ మండలం అంబట్‌పల్లికి చెందిన దగ్గు వెంకటేశ్ తల్లి శాంతమ్మ (62) అనారోగ్య బారిన పడింది. దీంతో భార్య సంగీతతో కలిసి వెంకటేశ్ తల్లిని వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తన సొంత కారులో తీసుకెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో మహదేవపూర్ సమీపంలోని జాతీయ రహదారి 363 వద్ద కారు టైరు పగిలింది. దీంతో కారు అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్థానికులు వీరిని 108 వాహనం ద్వారా మహదేవపూర్ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడి నుంచి వైద్యులు భూపాలపల్లి ఆస్పత్రికి పంపారు. మార్గమధ్యలోనే శాంతమ్మ మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్తింటి వేధింపులకు యువతి బలి



యమున(ఫైల్)

మహాముత్తారం, ఆగస్టు 9: అత్తింటి వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మీనాజీపేటకు చెందిన ముడెత్తుల యమున (24)కు ఐదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన ముడెత్తుల సమ్మయ్యతో ప్రేమ వివాహం జరిగింది. ఈ పెళ్లి నచ్చక అప్పటి నుంచి భర్త తల్లి పద్మ, భర్త సోదరుడు పవన్ నిత్యం యమునను వేధించేవారు. కొద్ది రోజుల తర్వాత భర్త కూడా వారికి వత్తాసు పలకడం మొదలెట్టాడు. మద్యం తాగొచ్చి భార్యను కొట్టేవాడు. ఈ క్రమంలో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. అయినా అత్తింటి వారిలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో మనస్తాపం చెందిన యమున పురుగుల మందు తాగి ఇంటి వద్దే మృతి చెందింది. మృతురాలి తల్లి జునువాల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై మహేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు.

భూపాలపల్లిలో దొంగల బీభత్సం

- రూ.9తులాల బంగారం, నగదు, సామగ్రి అపహరణ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 9: భూపాలపల్లి పట్టణ పరిధి మంజూర్‌నగర్‌లోని బీసీకాలనీలో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి 9 తొమ్మిది తులాల బంగారం, రూ. 40 వేల నగదుపాటు విలువైన సామ గ్రిని అపహరించారు. బాధిత కుటుంబం, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంజూర్‌నగర్ బీసీకాలనీ వెంగళ్‌రావు వెంచర్‌లో బొమ్మకంటి పవన్‌కుమార్ నివాసం ఉంటున్నాడు. అతడు జోన్‌కోలో ఉద్యోగం చేస్తుండగా భార్య మాధురి ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. ఎప్పటిలాగే ఇద్దరూ గురువారం డ్యూటీలకు వెళ్లారు. డ్యూటీ ముగించుకొని మధ్యాహ్నం పవన్ కుమార్ ఇంటికి చేరగా, భార్య లంచ్‌కు వచ్చి మళ్లీ వెళ్లింది. అనంతరం వ్యక్తిగత పనుల నిమత్తం పవన్ కుమార్ భూపాలపల్లికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. అందులోని 12 తులాల బంగారంతోపాటు రూ. 40 వేల నగదు చోరీకి గురయ్యాయి. ఇలా మొత్తం రూ.3 లక్షల 36 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. దీనిపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి సీఐ నరేష్‌కుమార్, ఎస్సై సుధా కర్‌తోపాటు క్లూస్ టీం సిబ్బంది పరిశీలించారు.

గుడుంబా కట్టడికి పటిష్ఠ చర్యలు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 9: జిల్లాలో గుడుంబా కట్టడికి పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని ఎక్సైజ్ శాఖ సూపరింటిండెంట్ వి.శ్రీనివాస్ తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో నాటుసారా కోరలు చాస్తోందని ఈనెల 6న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన వెలువరించారు. భూపాలపల్లి, కాటారం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ముమ్మర తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జనవ రి 1 నుంచి జూలై 31 వరకు ఈ రెండు స్టేషన్ల పరిధిలో 492 మందిపై కేసు లు నమోదు చేసి 262 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. అలాగే, 96,04 లీటర్ల గుడుంబా, 1,49,660 లీటర్ల బెల్లం పానకం, 1015 కిలోలల బె ల్లం స్వాధీనం చేసుకొని 73 వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. గుడుంబా కట్టడికి దాడులు నిరంతరంగా కొనసాగిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

శిశు విక్రయ ఘటనపై కేసు

- తల్లిదండ్రులతో పాటు కొన్న వ్యక్తికీ రిమాండ్

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 9 : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఇటీవల వెలుగు చూసిన ఆడ శిశువు విక్రయం ఘటనపై పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. బిడ్డను అమ్మిన తల్లిదండ్రులతోపాటు కొన్న వ్యక్తిపై కేసును నమోదు చేశామని ఏటూరునాగారం ఎస్సై తాజొద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కలివేరు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి ప్రసవం కోసం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి భర్త జంపయ్యతో కలిసి జూన్ 5న వచ్చింది. సాధారణ ప్రసవంతో ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటికే ఈ దపంతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉండగా మూడో కాన్పులోనూ మళ్లీ అమ్మాయే పుట్టడంతో వారు ఆ శిశువును విక్రయించారు. జూన్ 7న ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన వెంటనే ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన వేల్పుల సుధాకర్‌కు రూ. 15వేలకు అమ్మేశారు. ఈ క్రమంలో మనసు మార్చుకున్న ఆదిలక్ష్మి, జంపయ్య ఏటూరునాగారం ఇటీవల వచ్చి తమ బిడ్డను తమకు ఇచ్చేయమని సుధాకర్‌ను అడిగారు. అతడు నిరాకరించడంతో పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఈ వ్యవహారమంతా వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు జంపయ్య, ఆదిలక్ష్మితోపాటు శిశువును కొన్న సుధాకర్‌పై 103.2023యూఎస్ 81 ప్రొటెక్షన్ చిల్డ్రన్‌యాక్ట్ 2015 ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. శిశువును ఐసీడీఎస్ అధికారులకు అప్పగించినట్టు తెలిపారు.

గంజాయి ముఠా అరెస్టు



నిందితుల అరెస్టును చూపుతున్న ఎస్సై అభినవ్

కాటారం, ఆగస్టు 9: మహారాష్ట్ర నుంచి గంజాయి ని తెచ్చి విక్రయిస్తున్న నలు గురు యువకులను కాటా రం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్సై అభిన వ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం శివారులో గంజాయి రవాణా చేసే ముఠా సంచరిస్తోందనే సమాచారం రావడం తో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సై అభినవ్ తన సిబ్బందితో కలిసి చింతకాని క్రాస్ వద్ద మాటు వేశారు. బైక్‌పై ఓ యువకుడు వచ్చి అప్పటికే అక్కడ మరో బైక్‌పై ఉన్న ముగ్గురితో అనుమానంగా అటుఇటు చూస్తూ మాట్లాడుతుండగా పోలీసులు వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా 1కిలో 400 గ్రాముల ఎండు గంజాయి ఉన్న ప్యాకెట్ పట్టుబడింది. దీంతో పోలీసులు వారిని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేటకు చెందిన బొంతల రమేష్, భూపాలపల్లి పట్టణానికి చెందిన సాధు వినయ్, మల్హర్ మండలం కొయ్యూరుకు చెందిన లకావత్ రాహుల్, కాటారం గ్రామానికి చెందిన జాడి గణేష్‌గా గుర్తించారు. బొంతల రమేష్ అనే యువకుడు మహారాష్ట్ర నుంచి గంజాయిని తెచ్చి మిగతా ముగ్గురికి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడని ఎస్సై అభినవ్ వెల్లడించారు. దీంతో గంజాయితోపాటు, రెండు బైకులు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాచేస్తున్న నలుగురిని అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు. ఈ తనిఖీలో పీసీలు లక్ష్మీరాజు, జంపన్న, సాంబశివరావు, శ్రీనివాస్, రఘు, లవణ్, హరికుమార్, హోంగార్డు తిరుపతి పాల్గొన్నారు.

సఖీ సేవలను మహిళలు ఉపయోగించుకోవాలి

న్యూశాయంపేట, ఆగస్టు 9: సఖీ సెంటర్ సేవలను మహిళలు ఉపయోగించుకోవాలని సఖీ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. న్యూశాయంపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం సఖీ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ హైస్కూల్ ప్రిన్సిపాల్ సరోజ, టీచర్లు సరళ, సౌందర్య, మహేశ్వరి, అంబప్రసాద్, చంద్రమోహన్, నరసింహరావు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య



తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేదీ ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.



అనిరుధ్ (ఫైల్)

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం



ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతోపాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికీ 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

20 నుంచి బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: ఆగస్టు 20 నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ రెండో సెమిస్టర్ 2023-24 ఏడాది రెగ్యులర్ కోర్సు పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 20, 22, 24, 27 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల పరీక్షల జరుగుతాయని తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థుల పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు https:// kakatiya.ac.in కేయూ వెబ్‌సైట్ చూడలని సూచించారు.

13న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9: ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 13న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్.ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని ఇండస్ట్రియల్ డిటెక్టివ్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీలో సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ జాబ్స్ కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. పదో తరగతి, ఆపై క్వాలిఫికేషన్స్ ఉన్న 20 నుంచి 40 యేళ్లలోపు వయస్సు ఉన్న యువకులు జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 13న ఉదయం 11 గంటలకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9573885532 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఏజీపీగా సోమయ్య ఏజ్రా శాస్త్రీ నియామకం



హనుమకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అసెస్‌మెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా హైకోర్టు న్యాయవాది హన్మకొండ సోమయ్య ఎజ్రా శాస్త్రిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ లష్కర్‌సింగారానికి చెందిన హన్మకొండ సోమయ్య ఎజ్రా శాస్త్రీ ఆదర్శలా కాలేజీలో ఎల్‌ఎల్‌బీ చేసి 2018లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. అనంతరం హైకోర్టులో సీనియర్ న్యాయవాది పడాల ప్రవీణ్ కుమార్ దగ్గర ప్రాక్టీసు మొదలుపెట్టారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో కొంత కాలం న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. అనంతరం హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు కొనసాగించారు. చిన్న వయసులోనే ఏజీపీగా నియమితులు కావడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, ఆగస్టు 9: కాజీపేట సిద్ధార్థనగర్‌లోని డి.అమర్‌నాథ్ అనే వ్యక్తి నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు చేశరు. రూ.29వేల నగదు స్వాధీనం చేసుకుని ఐదుగురుని అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురిని విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ధ్రువీకరించారు.

గంజాయి కోసం చైన్‌స్నాచింగ్

జల్సాల కోసం ముఠాగా ఏర్పడి నేరాలు ● నలుగురు నిందితుల అరెస్టు
బంగారు పుస్తెల తాడు, ద్విచక్ర వాహనం స్వాధీనం ● సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా



వివరాలను వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

మట్టెవాడ, ఆగస్టు 9: గంజాయి, జల్సాల కోసం ముఠాగా ఏర్పడి నేరాలు, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నలుగు రు నిందితులను అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా తెలిపారు. శుక్రవారం వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. జూలై 30న మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తవాడకు చెందిన వడ్లకొండ వనజ మెడలోని బంగారు చైన్‌ను భూపాలపల్లికి చెందిన బొల్ల అనిల్, మహ్మద్ బాసిత్‌లు లాక్కొని స్కూటీపై భూపాలపల్లికి పరారైనట్లు తెలిపారు. అనిల్, బాసిత్‌లకు వరంగల్ ములుగు రోడ్డు వద్ద ప్రైవేట్ హాస్టల్‌లో షెల్టర్ ఇచ్చిన భూపాలపల్లి జిల్లా పలిమెల మండలానికి చెందిన మహ్మద్ షోయా బ్‌ఖాన్, చైన్‌స్నాచింగ్‌కు ప్లాన్ వేసిన భూపాలపల్లి రాజీవ్ నగర్‌కు చెందిన మహ్మద్ ఫారూక్‌ఖాన్‌లను శుక్రవారం ములుగురోడ్డు వద్ద పక్కా సమాచారంతో అదుపులోకి తీసు కున్నట్టు వెల్లడించారు. వారిని విచారించగా చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్టు ఒప్పుకున్నట్లు తెలిపారు. దాంతో వారి నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నట్లు డీసీపీ వెల్లడించారు.

నిందితులు గతంలో భూపాలపల్లి, వైజాగ్, పరకాల, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు నేరాలకు పాల్పడ్డరన్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దే శంతో ముఠాగా ఏర్పడి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి వరంగల్ కొత్తవాడలో మహిళ మెడలోంచి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డరని తెలిపారు. నిందితులు ఫారూక్‌ఖాన్, మహ్మద్ బాసిత్‌లు గంజాయి స్లగ్లింగ్ చేయడం, గంజాయి సేవించడం బొల్ల అనిల్, మహ్మద్ బాసిత్‌లు ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు పాల్పడిన కేసులలో నిందితులని అనిల్ పరకాల పోలీస్ స్టేషన్ పరిధి చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడని తెలిపారు. వైజాగ్ పరిధిలో గంజాయి కేసులో నిందితుడని డీసీపీ వివరించారు.

చైన్ స్నాచింగ్ నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన మట్టెవాడ సీఐ తుమ్మ గోపి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, భూపాలపల్లి డీఐ నరేశ్, మట్టెవాడ ఎస్సై విఠల్, సీసీఎస్ ఎస్సై సంపత్, పోలీస్ కానిస్టేబుళ్ళు హరికాంత్, మహ్మద్ అలీ, విజయ్‌కాంత్, మధుసూదన్, తిరుపతయ్య, రాజేందర్ ప్రసాద్, హోంగార్డు నాగేశ్వర్‌రావులను డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్‌లు అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ నందిరాం నాయక్, ఇన్‌స్పెక్టర్ గోపి, అబ్బయ్య, పాల్గొన్నారు.

ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

● కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ● కేయూలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



కేయూలో రిజిస్ట్రార్ మల్లారెడ్డితో ఆదివాసీ ప్రొఫెసర్లు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్బోధించారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సంబురాలు నిర్వహించారు. కేయూ మొదటి గేటు నుంచి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వరకు ఆదివాసీ కల్చరర్ ర్యాలీ, పతాకావిష్కరణ , జ్యోతి ప్రజ్వలన, సాంస్కృతిక సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ సెనెట్ హాల్‌లో కేయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంపన్నమైనది ఆదివాసీ సంస్కృతి అని చెప్పారు. సంస్కృతి పుట్టింది ఆదివాసీల నుంచే అని చెప్పారు. వర్సిటీ పరిధిలో 50 ఆదివాసీ ప్రాంతాలున్నాయని చెప్పారు. వర్సిటీ ఆదివాసీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. ఆదివాసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని అన్నారు. వ్యవసాయమే కాకుండా ఇతర రంగాల్లో ప్రవేశించి నిపుణులుగా ఎదగాలని అకాంక్షించారు.

విశిష్ట అతిథిగా హాజరైన ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.భిక్షపతి రావు మాట్లాడుతూ.. ఆదివాసీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహిచాలని అన్నారు. మన పూర్వీకులు సంప్రదాయ పద్ధతులతో వ్యాధులు, రోగాల నివారణ చేశారని అన్నారు. ఆదివాసీలు విద్యపైన దృష్టి సారించాలని అన్నారు. చదువుకున్న ప్రతీ ఒక్క ఆదివాసీ తోటివారిలో విద్యపై అవగాహన కల్పించి వారిని అభివృద్ధి పథంలోకి తీసుకుని రావాలని పిలుపునిచ్చారు. రిటైర్డు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సారయ్య దొర మాట్లాడుతూ.. ఆదివాసీలు మూలాలను మరవద్దని అన్నారు. శాస్త్రీయమైంది ఆదివాసీల గోత్ర వ్యవస్థ అని చెప్పారు. భావాలు, ఉద్దేశాలు మంచిగా ఉండాలని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా 90దేశాల్లో ఆదివాసీలున్నాయని చెప్పారు. 30 ఏళ్లగా ఆదివాసీలు అనేక సాంస్కృతిక పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీల్లో అవగాహన రావాలన్నారు. ఆదివాసీల అభివృద్ధికి నిధుల కేటాయింపు పెరగాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆదివాసీ యువత సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ వాసం ఆనంద్ కుమార్, రవి, కుమారస్వామి, రాజేశ్, సురేందర్, సాయి, తాటి అనిల్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖలో బదిలీలు

6బి కేటగిరీలో ఆలయాల్లో ఇద్దరు ● 6ఏ కేటగిరీ గుడుల్లో ఆరుగురు

హనుమకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగిన బదిలీల్లో మొత్తం 8మంది ఉద్యోగులకు స్థాన చలనం జరిగింది. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పరిధిలోకి వచ్చే 6బీ కెటగిరీకి వచ్చే దేవాలయాల నుంచి ఇద్దరు, రీజినల్ జాయింట్ కమిషనర్ పరిధిలోకి వచ్చే 6ఏ దేవాలయాల్లో ఆరుగురికి బదిలీలు జరిగాయి. 6బి కేటగిరీ కింద వరంగల్‌లోని కట్టమల్లన్న దేవాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మహిపాల్ వరంగల్ ఉర్సు ప్రాంతంలోని నాగేశ్వరాలయానికి, అక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్యాంసుందర్ కట్టమల్లన్న గుడికి బదిలీ అయ్యారు. నాగేశ్వరాలయంలో పనిచేస్తున్న కార్యనిర్వహణాధికారి (ఈవో) కమల రిటైరయ్యారు. ఆమె స్థానంలో వరంగల్ దుర్గేశ్వరాలయం ఈవో ప్రసాద్‌ను నాగేశ్వరాలయం ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు అప్పగించారు. కాగా 6ఏ కేటగిరి కింది వేయిస్తంభాలగుడిలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్ ఐనవోలుకు బదిలీ అయ్యారు. ఐనవోలు ఆలయంలో పనిచేసే .జూనియర్ అసిస్టెంట్ మధుకర్ వేయిస్తంబాల గుడికి వచ్చారు. కొత్తకొండ ఆలయంలో పనిచేసే సంజీవరావు ఐనవోలుకు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేసిన నారాయణ కొత్తకొండకు వచ్చారు. వరంగల్ బట్టలబజార్‌లోని రామిలింగేశ్వరాలయం ఈవో వెంకట్రావు హసన్‌పర్తిలోని ఎర్రగట్టు వెంకటేశ్వరాలయానికి, అక్కడ ఈవోగా పనిచేస్తున్న కిషన్‌రావు వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీవిశ్వేరాలయానికి స్థాన చలనం జరిగింది.


ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 12న స్పాట్ అడ్మిషన్ల క్యాంపు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులతో పాటు అర్హత సాధించని విద్యార్థులు సైతం ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఖాళీగా ఉన్న 7 సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదని ఆయన స్పష్టం చేశారు. స్పాట్‌కు హాజరయ్యే విద్యార్థులు వారి ఒరిజినల్, జీరాక్స్ సెట్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు.

వర్సిటీ అనుమతిలేని కళాశాలల్లో చేరొద్దు

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: కాకతీయ యూనివర్సిటీ అనుమతి లేకుండా నడుస్తున్న కళాశాలల్లో విద్యార్థులు అడ్మిషన్ల పొందవద్దని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విద్యార్థులకు సూచించారు. వర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థులు కళాశాల అఫ్లియేషన్‌ను చూసుకోవాలని, ఆయా వివరాలు వర్సిటీ డీన్, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కార్యాలయంలోనూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలు పేరు, అడ్రస్, మేనేజ్‌మెంట్ మార్చుకుని వర్సిటీ అనుబంధం ఉన్నట్లు తప్పుడు సమాచారంతో కొన్ని కళాశాలలు అడ్మిషన్లు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. తప్పుడు కళాశాలల్లో చేరిన విద్యార్థులకు వర్సిటీకి ఎలాంటి సంబంధం ఉండదని హెచ్చరించారు.

బయోటెక్నాలజీలో ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 9: రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం పరిశోధకుడు ప్రసన్నకుమా ర్ టీపీ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శుక్రవారం చైతన్య డీమ్డ్ వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.జగదీశ్వర్ ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'మైక్రోబియల్ ప్రొఫైలింగ్ ఆఫ్ జీవామృతం అండ్ అపిమైజేషన్ స్టడీస్ ఆఫ్ ఫర్మెంటేషన్ పారామీటర్స్ ఫర్ ది మాస్ ప్రొడక్షన్ ఆఫ్ బయోఫర్టిలైజర్ అనే అంశంపై చైతన్య టూబీ డీమ్డ్ వర్సిటీ బయోటెక్నాలజీ ప్రొఫెసర్ మురళీకృష్ణ పర్యవేక్షణలో ప్రసన్నకుమార్ పరిశోధన పూర్తి చేశారు. ప్రసన్నకుమార్ టీపీ అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన ప్రసన్నకుమార్ వీసీలు డాక్టర్ సీ.హెచ్.వి పురుషోత్తమ్ రెడ్డి, ప్రొఫెసర్ జి.దామోదర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి, రీసర్చ్ డీన్ ప్రొఫెసర్ టి.క్రిష్టోఫర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవీందర్‌తో పాటు పలువురు అభినందించారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 9: ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ములుగులో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆదివాసీ సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని పట్టణంలోని జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గిరిజన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జెండా వితరణ చేసి కొమురంభీంకు నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజ సూర్య, డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య, ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మంకిడి రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరం రవికాంత్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు వజ్జ రాజు, వివిధ సంఘాల నాయకులు కల్తి శ్రీనివాస్, గడ్డం లక్ష్మీనారాయణ, గొల్ల కుమార్, కుంజ అనసూయ, సోలం వెంకటేశ్వర్లు, కొమరం నాగేశ్వర్‌రావు, గంగయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ములుగులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు


భూపాలపల్లిలో మాట్లాడుతున్న జడ్జి జయరాంరెడ్డి

- కృష్ణకాలనీ (భూపాలపల్లి): అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. జయరాంరెడ్డి హాజరయ్యారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. అనంతరం వ్యాసరచన, ఉపన్యాసం, పాట లు, డాన్స్ పోటీల్లో విజేతులుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదా నం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు ఈసంపల్లి రాజారత్నం, న్యాయవాదులు బల్ల మహేందర్, మెరుగు రవీందర్, ప్రియాంక, కిరణ్, సమ్మయ్య పాల్గొన్నారు.
- మహాముత్తారం: మండలంలోని యామన్‌పల్లి గ్రామంలోని ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ నాయకులు బెల్లంకొండ కిష్టయ్య, మల్లేష్, శంకరయ్య, మహేష్, కండెల రాంచందర్, వెంకట్రాజం, కాంగ్రెస్ నాయకులు పక్కల సడువలి, వంశీరాజ్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.
- వెంకటాపురం(నూగూరు): ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు కొమరంభీం విగ్రహం వద్ద, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జెండాలను ఎగురవేశారు. అ


కాటారంలో ఆదివాసీల ర్యాలీ

మండలకేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాత్రాపురం, ఎదిర, దానవాయిపేట, అలుబాక గ్రామాల్లో ఆదివాసీ యూత్‌ల ఆధ్వర్యంలో ఆదివాసీ ప్రపంచ దినోత్సవాన్ని నిర్వహించారు. కొర్సా నర్సిం హమూర్తి, కోరం సంతోష్, పూనెం సాయి, చింత సోమరాజు, పర్శిక సతీష్, శంకర్, రాంచందర్, వెంకటకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- మల్హర్: మండలంలోని కొయ్యూర్, రుద్రారంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టం భూమయ్య, ప్రధాన కార్యదర్శి గుంటి రమేష్, నాయకులు గుంటి నాగరాజు, గడ్డం లచ్చయ్య, గుంటి బాపు, ముంజం శంకర్, బిస్కుల అశోక్, ఊరపెద్ది భాస్కర్, రాధకృష్ణ, తరుణ్, రామస్వామి, కిష్టయ్య, నాగరాజు, మల్లేష్, గాదె గట్టయ్య, సమ్మక్క, తిరుపతి, స్వామి, లక్ష్మయ్య, కిరణ్, వెంకటేష్, నారాయణ, రమేష్, లలిత, శారద, మాధవి తదితరులు పాల్గొన్నారు.
- మంగపేట : మంగపేటలో ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మండల కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు డబ్బుల ముత్యాల్‌రావు తుడుందెబ్బ జెండాను ఎగురవేశారు. అనంతరం కొమరంభీం విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమానికి తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్, ఏసీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పొదెం రవీందర్, తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి ఆగబోయిన చంద్రకాంత్, నాయకులు పొదెం నాగేష్, ఆగబోయిన సాయికుమార్, ఏఈడబ్ల్యూసీఏ మండల అధ్యక్షుడు చింత కృష్ణమూర్తి, ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు జబ్బ రవి, జబ్బ సమ్మయ్య, చాద మల్లయ్య, కల్తీ రామకృష్ణ పాల్గొన్నారు.
- వాజేడు: మండలంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐక్య ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా బైక్ ర్యాలీ చేపట్టారు. మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాలు, ఆదివాసీ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
- కాకతీయఖని: ఆదివాసీ కోయ సంఘం, ఎరుకల సంఘం, సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహిం చారు. నాయకులు రాంబాబు, రమేష్, నాగరాజు, వసంత్‌రావు, సుభాష్, రవికుమార్, రంజిత్, సునీల్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.
- కాటారం: ఏటూరునాగారం ఐటీడీఏ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో ఆదివాసీగిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలం రాజేందర్ ఆదివాసీ జెండావిష్కరించారు. ఆయా సంఘాల జిల్లా నేతలు మడే కుమార్, బద్ది సమ్మయ్య, రాజేందర్, సమ్మయ్యదొర. ఏటీడీవో దేశిరాంనాయక్, హెచ్‌ఎంలు రవిశంకర్, స్వరూప, అంజయ్య, హెచ్‌డబ్ల్యూవోలు శారదశివలక్ష్మి, సరిత, రాంగోపాల్‌రెడ్డి, శైలజ, పీడీలు వీరన్న, జితేందర్, తుడుందెబ్బ జిల్లా నేతలు మడే కుమార్, బద్ది సమ్మయ్య, నాయకులు గుర్రింగ బాపు, సుంకరి మల్లేష్, సమ్మయ్యదొర, మల్లయ్య, వినోద్, సతీష్, శ్రీను, శరత్, కిరణ్, స్వామి, కృష్ణ, సారయ్య, విజయ్, రమేష్, రాజు, నరేష్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.
- ములుగు రూరల్: ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ములుగు శివారు గట్టమ్మ దేవాలయం వద్ద ఆదివాసీ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ ఆధ్వర్యంలో జెండా ఎగరవేశారు. గట్టమ్మ పూజారి కొత్త సదయ్య, కొత్త రమేష్, కొత్త లక్ష్మయ్య, ఆకుల మొగిళి, కొత్త రవి, సారయ్య, రాజు, మహేందర్, లక్ష్మణ్, మురళి, శ్రీధర్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.
- గోవిందరావుపేట: ఆదివాసీ దినోత్సవ కార్యక్రమం మండలంలోని పస్రాలో జరిగింది. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు గొంది కిరణ్‌కుమార్ జెండావిష్కరణ చేశారు. ముఖ్య అతిథిగా సీఐ రవీందర్ హాజరై కొమరంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తుడుందెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి చింత కృష్ణ, ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడి సాయిబాబా, ఎస్సై కమలాకర్, ఆదివాసీ సంఘాల నాయకులు పూనెం శరత్‌బాబు, ఈక జగ్గారావు, వట్టం సురేష్, శ్రావణ్, వెంకటేశ్, పవీణ్, రాంబాబు, రాము, సమ్మయ్య, కన్నయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.
- వెంకటాపూర్(రామప్ప): ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు కూరెళ్ల రామాచారి తన తండ్రి జ్ఞాపకార్థం నందిపాడు గొత్తికోయ కుటుంబాలకు దోమతెరలు, బ్యాగులు, దుస్తులు పంపిణీ చేశారు. రజిత, రాజయ్య, సాంబయ్య, రాఘవేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.
- కన్నాయిగూడెం: మండల కేంద్రంలో తుడుందెబ్బ నాయకుల ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొడెం బాబు, కోరగట్ల రవీందర్, యాలం మురళి, ప్రభాకర్, పాపారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.
- తాడ్వాయి: మండల కేంద్రంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు మోకాళ్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ తోట రవీందర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, మేడారం చైర్మన్ లచ్చుపటేల్, తుడుందెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి కొర్నిబెల్లి గణేష్, ఆదివాసీ సంఘాల నాయకులు ఇర్ప సునీల్, రేగ కళ్యాణి, ఇర్ప అశ్వి ని, సూర్యం, మంకిడి నరసింహస్వామి, ఊకె రామయ్య, తాటి రాంచందర్, కాక నర్సింగరావు, మల్లెల రాంబాబు పాల్గొన్నారు.

మంగళవారం 'వందేభారత్' బంద్

గిర్మాజీపేట, ఆగస్టు 9: విశాఖపట్టణం -సికిందరాబాద్ -విశాఖపట్టణం మధ్య వరంగల్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మంగళవారం మినహా మిగిలిన ఆరు రోజులు నడుస్తాయని ఈస్ట్‌కోస్ట్ రైల్వే చీఫ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ (ట్రాఫిక్ సేఫ్టీ) డీసీ ప్రధాన్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులు నడుస్తున్నాయని, ఇక నుంచి ఆదివారానికి బదులుగా మంగళవారం ఈ రైళ్లు నడువవని, మిగిలిన ఆరు రోజులు యథావిధిగా నడుస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించి రైల్వేకు సహకరించాలని కోరారు.

రుణమాఫీ కాకపోవడానికి కారణాలు ఇవే..

'ఆంధ్రజ్యోతి' కథనంపై వ్యవసాయ అధికారి వివరణ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 9: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రైతు రుణమాఫీ రెండు విడతలుగా జరిగినప్పటికి చాలా మందికి వివిధ కారణాల వల్ల చాలామందికి కాలేదని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయభాస్కర్ తెలిపారు. రుణమాఫి కాని రైతులు పడుతున్న ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. రుణమాఫీ కాకపోవడానికి ప్రధాన కారణాలను ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు. కుటుంబ సభ్యుల నిర్ధా రణ జరగకపోవడం, రేషన్‌కార్డు లేకపోవడం, ఆధార్‌లో ఒక పేరు రుణ ఖాతాలో మరో పేరు ఉండటం, కొందరి ఇంటి పేరు, మరికొందరి పేరు తప్పుగా నమోదై ఉండటం, ఆధార్ నంబర్ సరిగా లేకపోవడం, ఒకే ఆధార్ నంబరు మరొకరు కూడా కలిగి ఉండటం, పట్టా పాస్‌బుక్ లేకుండా రుణం పొంది ఉండటం, కుటుంబ సభ్యుల్లో ఒకరు ప్రభుత్వ ఉద్యోగులై ఉండటం, వారి పేర్లు రేషన్ కార్డులో తొలగించకపోవడం, ఒకే రుణ ఖాతా కలిగిన రైతులు ఇద్దరు లేదా ముగ్గురు ఉండం.. ఇలా అనేక కారణాలు ఉన్నాయని వివరించారు. వీటి వల్లే రుణమాఫీ కాక అనేక మంది వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. వారి ఫిర్యాదలుఉ స్వీకరించేందుకు ఏవోలు, ఏఈవోలు కూడా సంసిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని, క్లస్టర్లు వారీగా సమస్యలను తెలుసుకొని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. బ్యాంకు పేరు తప్పుగా ఉన్నా, ఖాతా నంబర్ తప్పుగా ఉన్నా సమస్యను పరిష్కరి స్తామని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి సమస్య ఉన్నా వారి నుంచి రాత పూర్వకంగా తీసుకొని కమిషనరేట్‌కు పంపిస్తామని తెలిపారు.

మార్కెట్ పాలకవర్గం సమన్వయంతో ముందుకు సాగాలి : ఎమ్మెల్యే గండ్ర


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

గణపురం, ఆగస్టు 9: భూపాలపల్లి నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆకాంక్షించారు. గణపురం మండల శివారులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. మార్కెట్ కమిటీ సభ్యులంతా రైతులకు మేలు చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గూటోజు కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా రేపాక రాజేందర్, డైరెక్టర్లుగా జంగేటి సుధాకర్, బొమ్మకంటి రవి, ముప్పు శ్రీనివాస్, కొండగాని తిరుపతి, బావు దేవయ్య, పినుమండ్ల సాంబయ్య, సునావత్ రాజు, వంగపల్లి భాస్కర్, లింగంపల్లి శ్రీనివాస్‌రావు, సిరికొండ రామారావు, కట్కూరి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

భూపాలపల్లిటౌన్: మొక్కలు నాటడం సామాజిక బాధ్యతని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని 18,19వ వార్డులలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు.కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి మొక్క నాటారు. భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలని అన్నారు. అనంతరం భూపాలపల్లి మెయిన్‌రోడ్డు నుంచి వంద పడక ఆస్పత్రి వరకు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, నాయకులు రాజేందర్, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

పస్రాలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం

గోవిందరావుపేట, ఆగస్టు 9: మండలంలోని పస్రా పోలీస్‌స్టేషన్‌లో సీఆర్పీఎఫ్ డీ/58 బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం శుక్రవారం జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓఎస్డీ గీతే మహేష్ బాబాసాహెబ్ గొత్తికోయ కుటుం బాలకు కుట్టుమిషన్లు, సైకిళ్లు, ప్లాస్టిక్ వాటర్ ట్యాంకులు, సోలార్ లైట్లు, యువతకు వాలీబాల్, బాస్కెట్‌బాల్ కిట్లు, క్యారమ్‌బోర్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ప్రసాద్, పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : ఓఎస్డీ

ములుగు రూరల్: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఓఎస్డీ గీతే మహేష్ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా శనివారం ములుగు మండలం బండారుపల్లిలో యువతకు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన కన్నాయిగూడెం టీంకు రూ. 5 వేల ప్రథమ బహుమతిని అందజేశారు. అంకన్నగూడెం టీంకు రూ. 2 వేలు, పలు టీంలకు రూ. 500తో పాటు జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఓఎస్డీ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్ పాల్గొన్నారు.

రైతుల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

(5వ పేజీ తరువాయి)

ఉందన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. రైతుల కోరికమేరకే భూ సేకరణ జరుగుతుందన్నారు. రైతుల సలహాలు, సూచనలు తెలుసుకోవడానికే ఈసమావేశం ఏర్పాటు చేశామన్నారు. రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల పరిధిలోని 13 గ్రామాల్లోని 350 ఎకరాల్లో 35 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతుందన్నారు. నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నచోటుకు మార్చి తక్కువ మొత్తంలో భూములు సేకరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నేషనల్‌హైవే అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అటెండర్ ఆత్మహత్య


పాషా (ఫైల్)

చిట్యాల, ఆగస్టు 9: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిర్మలపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన షేక్ రియాజ్ పాషా (30) మండ లంలోని చల్లగరిగ ప్రాథమిక పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తు న్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై అనారోగ్య సమస్యలతో ఇబ్బం దులు పడుతున్నాడు. గురువారం సాయంత్రం రియాజ్ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అతడి తల్లి బానుబేగంకు చెప్పాడు. ఆమె స్థానికుల సహాయంతో చిట్యాల సామాజిక ఆస్పత్రిలో చేర్పించింది. మెరుగైన వైద్యసేవల కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా రియాజ్ ఆరోగ్య పరిస్థితి క్షీణించి శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

'ఇంటింటా ఇన్నోవేషన్' పోస్టర్ ఆవిష్కరణ

మహాముత్తారం, ఆగస్టు9 : మహాముత్తారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావు ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గ్రామీణ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తోందని అన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని యువత, ప్రతిభవంతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ జాడి నరేందర్, ఉపాధి హామీ ఏపీవో కుమారస్వామి, సూపరింటెండెంట్ రమేష్, జూనియర్ అసిస్టెంట్ ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఇస్సిపేట మాజీ సర్పంచ్ మృతి


కొమరయ్య (ఫైల్)

మొగుళ్లపల్లి, ఆగస్టు 9: మండలంలోని ఇస్సిపేట గ్రామ మాజీ సర్పంచ్ కొడారి కొమురయ్య(62) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. కొమరయ్య 2006 నుంచి 2011 వరకు ఆయన సర్పంచ్‌గా కొనసాగారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

మహదేవపూర్, ఆగస్టు 9: మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రౌడీషీటర్లకు కౌన్సెంగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాంచందర్‌రావు మాట్లాడుతూ రౌడీషీటర్ల తమ ప్రవర్తన మార్చుకోవాలని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తీరును మార్చుకుంటే కేసులు కొట్టివేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్ పాల్పడితే చర్యలు : డీఎస్పీ

కాటారం, ఆగస్టు 9: ర్యాగింగ్ పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్‌లో భాగంగా కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావంతో చదువుకుని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఎస్సై అభినవ్, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

13న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా

కాకతీయఖని, ఆగస్టు 9: నిరుద్యోగ యువతకు ఈనెల 13న జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి శాఖ అధికారి శ్యామల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓ ప్రైవేటు సంస్థలో పనిచేసేందుకు 150 మందికి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. భూపాలపల్లి బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాలలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్ జిల్లాలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్‌గా పనిచేసేందుకు 18 సంవత్సరాలు నిండి, ఇంటర్మీడియెట్ పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల యువతీ, యువకులు 13న ఉదయం 10:30 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హాజరు కావాలని కోరారు.

సీపీఎంతోనే ప్రజా పోరాటాలు సాధ్యం : మచ్చా

వాజేడు, ఆగస్టు 9: ప్రజా పోరాటాలు సీపీఎంతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో పార్టీ సీనియర్ నాయకుడు కారం శంకరయ్య సంస్మరణ సభను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. మండలంలో గిరిజన, గిరిజనేతర సమస్యలపై నిత్యం పోరాటాలు చేసిన ఘనత శంకరయ్యది అని కొనియాడారు. శంకరయ్య మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పేదల కోసం ఆహర్నిశలు పాటుపడిన వ్యక్తి శంకరయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బీరెడ్డి సాంబశివ, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, తోలెం ముత్తయ్య, దేవయ్య, రవీందర్, దేవేంద్ర, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, భూలక్ష్మి పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 9: మండలంలోని మల్లయ్యపల్లి, నల్లగుంట గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై స్థానిక ఎస్సై జక్కుల సతీష్, ఎక్సైజ్ ఎస్సై లింగాగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. 750 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతోపాటు 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు.

అసాంఘిక శక్తులతో అప్రమత్తంగా ఉండాలి : ఏఎస్పీ

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 9: గ్రామాల్లోని ప్రజలు అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ అన్నారు. మండలంలోని కంత్తగుంపు గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన గ్రామస్థులను సమావేశపరిచి మాట్లాడారు. గ్రామంలోకి అపరిచిత వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం సీఆర్పీఎఫ్ ఎ/58 బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామస్తులకు కుట్టుమిషన్లు, సింటెక్స్ వాటర్ ట్యాంకులు, సోలార్‌లైట్లు, సైకిళ్లు, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్యారంబోర్డులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలోసీఐ బండారి కుమార్, సీఆర్పీఎఫ్ కమాండెంట్ సన్న ఓబయ్య, ఎస్సై కొప్పుల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మల్హర్, ఆగస్టు 9 : మండలంలోని రుద్రారంలో బాల్య వివాహాన్ని శుక్రవారం అధికారులు అడ్డుకున్నారు. బాలల పరిరక్షణ జిల్లా అధికారి వెంకటస్వామి సమాచారం మేరకు తహసీల్దార్ రవికుమార్ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. బాల్య విహహాలు నేరమని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించార బాల్య విహహాలు చేయడం వల్ల కలిగే దుష్పపరిమాణాలు గురించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలల పరిర క్షణ జిల్లా ఇన్‌చార్జి అధికారి వెంకటస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ, డీసీపీయూ కౌన్సి లర్ శైలజ, చైల్డ్‌హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ ప్రవీణ్, కార్యదర్శి సాయిచరణ్, పోలీసులు పాల్గొన్నారు.

మూడో అంతస్థు నుంచి దూకిన విద్యార్థిని

కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు

ములుగు, ఆగస్టు 9: ములుగులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో విద్యార్థిని శుక్రవారం పాఠశాల భవనం మూడో అంతస్థు నుంచి కిందకు దూకిం ది. ఈ ఘటనలో బాలిక తీవ్రంగా గాయపడింది. ములుగు మండలం జంగాలపల్లికి చెందిన కొయ్యడ సుమలత-రాజు దంప తుల కుమార్తె కార్తీకశ్రీ గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కొన్నేళ్ల క్రితం తండ్రి మరణించడంతో తల్లి సంరక్ష ణలో ఉంది. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భవనం మూడో అంతస్థులో ఉన్న మూత్రశాలల వైపు వెళ్లిన కార్తీకశ్రీ అక్కడి నుంచి కిందకు దూకింది. గమనించిన చుట్టుపక్కల వారు గురుకులం ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. దీంతో గాయపడ్డ బాలికను ములుగు ఏరియా వైద్యశాలకు తరలిం చారు. ప్రథమ చికిత్స అనంతరం అంబు లెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం ఓప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. మూడో అంతస్థు నుంచి పడటంతో బాలిక పక్కటెముకలు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాల కోసం గురుకులం ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి

మొగుళ్లపల్లి, ఆగస్టు 9: పవిత్ర శ్రావణమాసంలో నాగుల పంచమి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి మహిళలు నాగేంద్రుడు ఉన్న పుట్టల వద్దకు బారులు తీరారు. ఎల్లారెడ్డిపల్లి నాగ దేవాలయంలో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. అలాగే ఎల్లారెడ్డిపల్లి గ్రామం లోని నాగదేవత ఆలయాన్నిఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సందర్శించారు. పలు అభివృద్ధి పనులకు భూమి పూజా చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

కోటంచ ఆలయంలో..

రేగొండ: మండలంలోని కోటంచ లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నాగమయ్య పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. కొబ్బరి కాయలు కొట్టారు. అదేవిదంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఈవో మహేష్ ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భిక్షపతి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆఫీస్ గదికి తాళం

టేకుమట్ల, ఆగస్టు 9: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆఫీస్ గదికి కాంట్రాక్టర్ మూత ఐలయ్య తాళం వేశారు. భవన నిర్మాణం చేసిన బిల్లు రావడం లేదని శుక్రవారం నిరసనకు దిగారు. 2019లో టేకుమట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రాజీవ్ విద్యా మిషన్ నుంచి సైన్స్ ల్యాబ్ నిర్మాణం కోసం రూ.9 లక్షలు మంజురైనట్లు తెలిపారు. అవి సరిపోక మరో రూ.80వేల వరకు సొంత డబ్బులు ఖర్చు చేసి భవనాన్ని పూర్తి చేసి ఇచ్చినట్లు తెలిపారు. బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరగ్గా కొన్ని చెల్లించారని, మరికొన్ని రావాల్సి ఉందని పేర్కొన్నారు.